# ఇంటికి దీపం టీవీ...

గీతా సుబ్బారావు

ఏమండోయ్... అంటూ గావుకేక పెట్టింది ఆ ఇంటి ఇల్లాలు.

వరండాలో అద్దంలో చూసుకుంటూ గడ్డం గీసుకుంటున్న ఆమె మొగుడుగారు భార్య అరుపుకి కంగారు పడుతూ... హాల్లోకి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

చూడండీ!... మన టీవీ పాడైపోయింది! ఉదయం మీరు వార్తలు చూశారుగా... అని అడిగింది ఇల్లాలు.

టీవీ సరిగా రావట్లేదు అని చెప్పడానికి అంత గట్టిగా అరిచావా?

అవునండీ!... టీవీ పాడైతే కంగారు పడనా మరి?

నేను ఇవాళ ఆఫీసుకి త్వరగా వెళ్ళాలి! దాని గురించి నీకు కంగారు లేదా?

మీరు త్వరగా వెళ్ళాలని... మీ గడ్డం నేను గీయలేనుగా! మీ స్నానం నేను చేయలేనుగా!...

అరవకు!... వంట చేశావా? ఇవాళన్నా



కూర చేశావా?...

అన్నం వండేశాను! టీవీ చూస్తూ కూర తరగాలనే టీవీ ఆన్ చేస్తే రావడం లేదు.

అంటే!... టీవీ లేకపోతే కూర చేయవా?

మీ ప్రతిపక్షం బుద్ధి మండిపోనూ!... పది హేను వేల రూపాయల టీవీ పాడైందంటే... మీకు తేలు కుట్టినట్టు కూడా లేదేంటీ?... దాని మీద మా నాన్న చేసిన అప్పు ఇంకా తీరలేదు! టీవీ పాడైతే కంగారు పడక... ఆనందించ మంటారా?

టీవీ పాడు కాలేదు. నేనే కేబుల్ కనెక్షన్ తీయించేశా!...

ఏం ఎందుకని?... టీవీ చూసి... నీ పెళ్ళాం పాడైపోతోందని... మీ అమ్మగారు చెప్పారా? మీ చెల్లెలు చెప్పిందా?...

ఛీ ఛీ... ఎప్పుడూ వాళ్ళ మీద ఏడుస్తావేం?

మరి... వాళ్ళు ఎప్పుడూ నా మీద పడి ఏడుస్తారు. మరి వాళ్ళు చెప్పకపోతే... కేబుల్ కనెక్షన్ ఎందుకు కట్ చేయించారు?

నీ పిల్లల కోసం!... వాళ్ళకి పరీక్షలు కదా!... టీవీ చూస్తూ... చదవడం మానేస్తా రని... కేబుల్ కనెక్షన్ తీయించేశా!

ఏంటీ... నీ పిల్లలు అంటున్నారు. మీకు వేరే పిల్లలు ఉన్నారా?... అనుకున్నాను... అప్పుడప్పుడూ క్యాంపులని పోతూ ఉంటా రుగా! ఎక్కడో... మరో సెటప్ పెట్టారని!

ఛీ ఛీ... ఆ టీవీ సీరియల్స్ చూసే ఇలా తయారయ్యావ్...

అవును! టీవీ సీరియల్స్ చూశాకనే నా కళ్ళు తెరుచుకున్నాయ్! మాలాంటి వాళ్ళని చూసే... ఆ సీరియల్స్ రాస్తున్నారు... అమ్మో... మీ మగాళ్ళని నమ్మకూడదు!... ఎన్ని పెళ్ళిళ్ళ యినా చేసుకుంటారు...

ఛీ ఛీ... నువ్వు మారవు!... ఆ టీవీ ఎవరికైనా అమ్మేస్తా!...

అమ్ముతారు... మనది కానిది ఏదైనా అమ్మే స్తారు! అది మా నాన్న కొన్న టీవీ కదా... అందుకే అమ్మేస్తారు! ఏదో ఒకరోజు నన్ను కూడా అమ్మేస్తారు!

నిన్నా? నిన్ను ఎవరు కొంటారు?

కొనేవాళ్ళుంటే అమ్మేస్తారా?

వోరినాయనోయ్... నీతో వాదనకు దిగ లేను! నువ్వూ వద్దు! నీ సంసారమూ వద్దు! వెళ్ళి... సన్నాసుల్లో కలసిపోతా!...

'ఆహా! మీరు సన్నాసుల్లో కలసిపోవడమా? కూరలో ఉప్పు ఎక్కువైతే తినలేరు! కాఫీ లేకుం డా బ్రతకలేరు!... మీరు సన్నాసుల్లో కలవడం కాదు... నేను వదిలిపోతే... ఆ రెండోదాని దగ్గరకి పోతారు!... నాకు తెలుసు...


అంతలో మొగుడుగారి మొబైల్ ఫోన్ మోగింది!... వాళ్ళ చిన్నబ్బాయి... ఫోన్ తెచ్చి ఇచ్చాడు.

హలో! నేనే సార్! దారిలో ఉన్నాను!... ఇక్కడ ట్రాఫిక్ ఎక్కువగా ఉంది! ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాను... ఇంకో అరగంటలో ఆఫీసులో

**మాటల హోరు...**

నయాగరా జలపాతం గురించి యాత్రి కులకు వివరిస్తున్నాడు గైడ్...

"ఈ జలపాతాల హోరు ముందు సూప ర్‌సోనిక్ విమానాల హోరు కూడా బలా దూర్. ఇక్కడి మహిళలంతా కొంచెంసేపు వారి మాటలు ఆపితే జలపాతాల హోరుని వినవచ్చు".




ఉంటా!... అంటూ ఆఫీసర్‌కి అబద్ధం చెప్పి... బాత్‌రూమ్‌లోకి పరిగెత్తి... అర నిమిషంలో స్నానం చేసి... డ్రస్సు వేసుకొని తలదువ్వు కుంటూ... బయటకు పరిగెత్తాడు మొగుడు...

క్షణంలో కూర చేస్తా! అన్నం తిని వెళ్ళం డి... అంది భార్య.

క్యాంటీన్‌లో ఏదో ఒకటి తింటాలే!...

డాడీ... డాడీ! క్రికెట్ మ్యాచ్ చూడడానికి పక్కింటికి వెళ్తా! ప్లీజ్ డాడీ... అంటూ వెంట బడ్డాడు కొడుకు.

స్కూటర్ స్టార్ట్ చేస్తున్న మొగుడికి ఎదురుగా వచ్చింది పెళ్ళాం.

ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. కాస్త నెమ్మదిగా వెళ్ళండి! మీరు ఆఫీసుకి ఆలస్యంగా వెళ్ళడం... మీ బాస్‌కి అలవాటు అయిపోయి ఉంటుంది... కంగారు పడకండి...

సర్లే... తప్పుకో...

మరో చిన్నమాట! సాయంత్రం కాస్త త్వర గా రండి!... అంట్లన్నీ నేను ఒక్కర్తినే తోము కోవాలి... కాస్త హెల్ప్ చేద్దురుగాని! ప్లీజ్...

ఏం... పనిమనిషి మళ్ళీ సెలవు పెట్టిం దా?...

లేదు! అది టీవీ సీరియల్స్ చూస్తూ... పని చేస్తుంది! టీవీ లేకపోతే అది పని చేయలేదుట! ఆ మాట ముందే చెప్పింది! అంచేత...

పిల్లల పరీక్షలు అయ్యేవరకూ... టీవీ ఉం డదుగా! అది పనిలోకి రాదు...

సరే! సరే! నేను ఆఫీసుకు వెళ్ళి... ఆ కేబుల్ వాడికి ఫోన్ చేస్తాలే! నువ్వు... తప్పుకో! ఆఫీసు లో నా మొగుడు నన్ను వాయిస్తాడు!...

ఛీ! మీరు కూడా టీవీ చూసి బూతులు ఆడుతున్నారు... అంటూ ఓ నవ్వు నవ్వింది ఆ ఇల్లాలు.

ఆ మొగుడికి వళ్ళు మండిపోయింది! కానీ... నవ్వుతూనే... రోడ్డు మీదకు వెళ్ళి పోయాడు... పాపం!!